క్లుప్తంగా

ముగ్గుల పోటీలు



జనగామ: స్వచ్ఛ సర్వేక్షన్‌–2023, సంక్రాంతి పండగను పురస్కరించుకుని జనగామ మున్సిపల్ ఆవరణలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రజిత ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో చైర్‌పర్సన్ పి.జమున లింగయ్య, మహిళలు, ఆర్పీలు పాల్గొని మన సంస్కృతి, సాంప్ర దాయాలు ఉట్టిపడేలా ముగ్గులు వేశారు.

ఎంఎస్‌ఎంఈ ఆధ్వర్యంలో..

లింగాలఘణపురం: మండల కేంద్రంలో ఎంఎస్‌ఎంఈ (మినిస్ట్రీ ఆఫ్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్) ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మండల కేంద్రంలో ఎంఎస్‌ఎంఈ ఆధ్వర్యంలో జూట్ బ్యాగుల తయారీలో శిక్షణ పొందుతున్న మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. నిర్వాహకులు సుందరయ్య, ట్రైనీ నాగమణి, మహిళలు పాల్గొన్నారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు



బచ్చన్నపేట: ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలలో రాణించాలని, క్రీడలతో నాయకత్వ లక్షణాలు అలవడుతాయని ఎస్సై నవీన్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మాపూర్‌లో వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్‌కుమార్, వైస్ చైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ నూకల నవ్యానర్సిరెడ్డి, ఉప సర్పంచ్ శివరాత్రి తిరుపతి పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

జఫర్‌గఢ్: గ్రామ పంచాయతీ నిధుల విషయంలో అక్రమాలకు పాల్పడిన జఫర్‌గఢ్ సర్పంచ్ బల్లెపు నర్సింగరావుపై చర్య తీసుకోవాలని 5వ వార్డు సభ్యుడు, సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యుడు కాట సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుధాకర్ మాట్లాడారు. 2019 నుంచి 2022 సంవత్సరానికి జఫర్‌గఢ్‌కు మంజూరైన నిధులను గ్రామాభివృద్ధికి ఖర్చు చేయకుండా అప్పటి కార్యదర్శి, ఉప సర్పంచ్ తప్పుడు పత్రాలతో సర్పంచ్ నర్సింగరావు నిధులు స్వాహా చేయడంపై సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జీపీలో అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. వార్డు సభ్యులు ఎల్లయ్య, సీపీఎం మండల కార్యదర్శి రాపర్తి సోమయ్య, నాయకులు ఎక్బాల్, నల్లతీగల శ్రీను పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

చిల్పూరు: మండల కేంద్రానికి చెందిన గాడిపల్లి మహేశ్వర్(56) మంగళవారం అర్ధరాత్రి మద్యం మత్తులో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. ఎలక్ట్రీషన్, మెకానిక్‌గా మంచి పేరున్న మహేశ్వర్ మద్యానికి బానిసై నిత్యం గొడవలు పడేవాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు తోడు కావడంతో మనస్థానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం వరకు లేవకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపులు తెరిచి చూడగా మృతిచెంది కనిపించాడు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

‘కంటి వెలుగు’ను వినియోగించుకోవాలి



బచ్చన్నపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



కొడకండ్ల: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

బచ్చన్నపేట: ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే రెండో విడత కంటి వెలుగును ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో నిర్వహించిన కంటి వెలుగు సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గ్రామాల్లో అంధత్వం ఉన్న వారిని ఆయా గ్రామాల నాయకులు గుర్తించి క్యాంపుల వద్దకు తీసుకు రావాల చెప్పారు. రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి, ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి, ఎంపీడీఓ రఘురామకృష్ణ, తహసీల్దార్ వినయలత, మండల స్పెషలాఫీసర్ వినోద్‌కుమార్, సర్పంచ్‌ల, ఎంపీటీసీల మండల ఫోరం అధ్యక్షులు సతీష్‌రెడ్డి, దూడల కనుకయ్య, మండల వైద్యాధికారి నవీన్‌రెడ్డి, సర్పంచ్ మల్లారెడ్డి ఆయా గ్రామాల సర్పంచ్‌ఉ, ఎంపీటీసీ, సిబ్బంది పాల్గొన్నారు.

దిగ్విజయం చేయాలి..

చిల్పూరు: ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది ఐకమత్యంతో దిగ్విజయం చేయాలని ఎమ్మెల్యే రాజయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఎంపీపీ బొమ్మిశెట్టి సరిత అధ్యక్షతన నిర్వహించిన కంటి వెలుగు మండల స్థాయి సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రంథాలయ చైర్మన్ కృష్ణారెడ్డి, తహసీల్దార్ విమల, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీఓ మధుసూదన్, ఆర్‌ఐ శ్రీనివాస్, సర్పంచ్‌లు రాజ్‌కుమార్, రూప్లానాయక్, రఘుపతి, పాటు వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కంటి వెలుగుపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ రడపాక సుదర్శన్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రాజయ్య హాజరై మాట్లాడారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీధర్ స్వామి, వైస్ ఎంపీపీ కొడారి కనకయ్య, ఎంపీటీసీలు జ్యోతి రజిత యాకయ్య, ఇల్లందుల స్రవంతి మొగిళి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేద్దాం..

కొడకండ్ల: సమన్వయంతో కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని స్థానిక ప్రజాప్రతినిధులు అన్నారు. మండలకేంద్రంలో సర్పంచ్ మధుసూదన్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కంటివెలుగు కరపత్రాలను ఆవిష్కరించారు. మార్కెట్ చైర్మన్ రాము, ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, ఎంపీటీసీలు విజయలక్ష్మి, నసీరుద్దీన్, ఎంపీఓ శ్రీనివాస్, ఉపసర్పంచ్ రమేష్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

పాలకుర్తి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ నల్లా నాగిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి వెలుగుపై వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జెడ్పీ ఫ్లోర్ లీడర్ పుస్కూరి శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ పాల్‌సింగ్, వైద్యాధికారి హరికృష్ణరెడ్డి, ఎంపీడీఓ అశోక్‌కుమార్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా ‘డబుల్’ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక



అధికారులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని పాంనూర్ గ్రామానికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 40 డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల తుది జాబితా ఎంపిక కోసం గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా జరిగింది. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కోతి రేణుకరాములుగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభకు ముఖ్య అతిథిగా తహసీల్దార్ పూల్‌సింగ్‌చౌహాన్ హాజరయ్యారు. ముందుగా లబ్ధిదారుల ఎంపిక నియమ, నిబంధనలు, వచ్చిన దరఖాస్తులు, లబ్ధిదారుల జాబితా తదితర నివేదికను ఆర్‌ఐ అర్జున్ తెలిపారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడారు. మొత్తం 40 ఇళ్లు మంజూరు అయినందున 250 దరఖాస్తుల్లో స్క్రీనింగ్ చేసిన తుది జాబితాలో ఎంపికైన 55లో 40 మంది లబ్ధిదారులను డ్రా పద్ధతిలో ఎంపిక చేస్తామన్నారు. దాంతో డ్రా పద్ధతి వద్దని నేరుగా నిరుపేదలను ఎంపిక చేయాలని గ్రామస్తులు రెవెన్యూ అధికారులతో వాగ్వాదం చేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల మాదిరిగా బీసీలకు ఎందుకు రిజర్వేషన్లు లేవని పలువురు అధికారులతో వాదించారు. ఈ క్రమంలో సభ రసాభాసాగా మారింది. కాగా, తహసీల్దార్ స్పందిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనిచేస్తామని, డబుల్‌బెడ్రూం లబ్ధిదారుల ఎంపికలో బీసీలకు ప్రత్యేక రిజర్వేషన్ లేదని స్పష్టం చేశారు.

లాటరీ పద్ధతిలో..

ప్రజలు, అధికారుల వాగ్వివాదాలు, గొడవల అనంతరం ఎట్టకేలకు లాటరీ పద్ధతికి గ్రామస్తులు అంగీకరించగా తహసీల్దార్ లాటరీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. మొదట 55 మంది తుదిజాబితాలో ఎస్సీ, ఎస్టీలు 23 మంది ఉండగా 50 శాతం రిజర్వేషన్‌తో 20 మందిని డ్రా పద్ధతిలో ఎంపిక చేశారు. అనంతరం మైనార్టీలు పది మంది ఉండగా రిజర్వేషన్ ప్రకారం ముగ్గురిని ఎంపిక చేశారు. అనంతరం జనరల్ కేటగిరిలో బీసీలు, ఓసీలు, మిగిలిన ఎస్సీలకు కలిపి మిగిలిన ఇండ్లకు ఎంపిక చేశారు. ఎట్టకేలకు మండలంలోని మొదటగా డ్రా పద్ధతిలో పాంనూర్‌లో డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రక్రియ పూర్తయింది. కార్యక్రమంలో సర్పంచ్ కోతి రేణుక రాములు, ఎంపీటీసీ ఇనుగాల రజితరాజిరెడ్డి, ఆర్‌ఐ రవీందర్, కార్యదర్శి కృష్ణతోపాటు తదితరులు పాల్గొన్నారు.

యువతలో వజ్ర సంకల్పం అవసరం



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న బీరప్ప

జనగామ: వజ్ర సంకల్పం, ధృడమైన విశ్వాసం కలిగిన యువతతో దేశం ముఖ చిత్రం మార్చవచ్చని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాటి బీరప్ప అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ మైదానంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరిం చుకుని బీజేవైఎం ఆధ్వర్యంలో కొనసాగుతున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో బుధవారం బీరప్ప ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్రీడాకారులను కలిసిన తర్వాత ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో క్రీడలకు సంబంధించి ప్రత్యేకమైన పాలసీతో ముందుకు వెళ్తుందన్నారు. యువ మోర్చ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, నియోజక వర్గ కన్వీనర్ నవీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్, గిరిజన మోర్చ రాష్ట్ర నాయకుడు ఎల్లయ్య, పట్టణ అధ్యక్షుడు పవన్ శర్మ, పట్టణ ప్రధాన కార్యదర్శి సంపత్, నిమ్మల మధు, జిల్లా కార్యదర్శి ఉపేందర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు నివేదిస్తాం..



లింగాలఘణపురం: మండలంలోని నాగారంకు చెందిన సుమారు 140 మంది రైతులు గత నాలుగైదు నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతూ తిప్పలు పడుతున్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ మధుమోహన్ సమావేశం ఏర్పాటు చేసి రైతుల గోడును విన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 360 ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో చేర్చారని, తక్షణమే తమకు న్యాయం చేయాలని ఆర్డీఓను బాధిత రైతులు వేడుకున్నారు. దీంతో స్పందించిన ఆర్డీఓ సంబంధిత భూమి హైకోర్టు, స్పెషల్ ట్రిబ్యూనల్ కోర్టుల్లో స్టేటస్ కో ఆర్డర్ ఉందని, తమ చేతుల్లో ఏమీ లేదని కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంజయ్య, బాధిత రైతులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి



మాట్లాడుతున్న ఎండీ అబ్బాస్

జనగామ రూరల్: ప్రజల మధ్య మత విద్వేషాలు సృష్టిస్తూ రాజకీయ లబ్ధిపొందుతున్న కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బొట్ల శేఖర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో పేద ప్రజలను మరచిపోయి పెట్టుబడి దారులకు వేల కోట్ల రూపాయల దేశ సంపదను కేంద్రప్రభుత్వం దోచి పెడుతుందని విమర్శించారు. బీజేపీని కట్టడి చేయాలని లేకుంటే ప్రశ్నించే గొంతుకను దేశంలో అణచివస్తుందని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని, ఇందుకు బీజేపీకి వ్యతిరేఖంగా ఉన్న శక్తులను ఐక్యం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, రాపర్తి రాజు, గోపి, ఉపేందర్, ప్రకాష్, పాదల నాగరాజు, విజేందర్, సోమయ్య, చందు, యాకయ్య పాల్గొన్నారు.

అర్హులకే డబుల్ బెడ్రూం ఇళ్లు

జఫర్‌గఢ్: అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వడం జరుగుతుందని ఎంపీపీ రడపాక సుదర్శన్ పేర్కొన్నారు. మండలంలోని తమ్మడపల్లి (ఐ) గ్రామంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో ప్రత్యేక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి సర్పంచ్ గాదెపాక అనిత సుధాకర్‌బాబు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎంపీపీ సుదర్శన్ హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా డబుల్‌బెడ్రూం ఇళ్ల కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ స్వప్న, ఆర్‌ఐ అనిల్‌బాబుతో పాటు వార్డు సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీజేఐటీ అధ్యాపకులకు డాక్టరేట్లు



సత్కారం పొందుతున్న డాక్టరేట్ గ్రహీత

జనగామ: జనగామ మండలం యశ్వంతాపూర్ క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో పని చేస్తున్న ఇద్దరు అధ్యాపకులకు డాక్టరేట్లు ప్రదానం చేశారని కళాశాల డైరెక్టర్ ఫాదర్ టి.అగస్టీన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ యాంత్రిక విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న కొలిపాక యాకూబ్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. పీహెచ్‌డీ–2 థీసెస్‌ను పర్ఫార్మెన్స్ ఎవాల్యువేషన్ ఆఫ్ సోలార్ కుక్కర్ యూసింగ్ ఎనర్జీ ఎనాలసిస్ అంశంపై ఐఐసీటీ చీఫ్ సైంటిస్టు డాక్టర్ ఎం.రాధాక్రిష్ణ, ఓయూ మెకానికల్ విభాగం డాక్టర్ ఎ ఎంకె ప్రసాద్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేసినట్లు చెప్పారు. అలాగే కంప్యూటర్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న పి యూ అనిత జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌ను అందుకున్నట్లు చెప్పారు. ఎస్‌ఆర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ సీవీ రంగారావు, కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీఎస్‌ఈ విభాగాధిపతి డాక్టర్ డి.సురేష్‌బాబు పర్యవేక్షణలో ఎ న్యూ మెషీన్ లర్నింగ్ బేస్ట్ టెక్నిక్ ఫర్ స్పామ్ మెయిల్ డిటెక్షన్ అనే అంశంపై పీహెచ్‌డీ చేసినట్లు వివరించారు. డాక్టరేట్లు అందుకున్న ఇద్దరు అధ్యాపకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన కీసర యాదవరెడ్డి బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి చిన్నపెండ్యాల చేరుకొని మృతదేహం వద్ద నివాళులర్పించి బాధిత కుటుంబీకులను పరామర్శించారు. ఎమ్మెల్సీ వెంట సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, ఎంపీటీసీ ఉమసమ్మయ్య, గ్రంథాలయ చైర్మన్ కృష్ణారెడ్డి, రాజేందర్, యాదగిరి, దామోదర్ ఉన్నారు.

ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్..

యాదవరెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి పరామర్శించారు. అదే విధంగా మల్కాపూర్ గ్రామానికి చెందిన కెంగర్ల లక్ష్మి, భోగి లక్ష్మి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను కూడా ఎమ్మెల్యే పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

‘సఖి’ సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఏలు

కొడకండ్ల : బాలికలు, స్త్రీలపై జరిగే హింసను అడ్డుకోవడానికి సఖి కేంద్ర ఆధ్వర్యంలో అందించే సేవలను వినియోగించుకోవాలని సీఏలు రేణుక, జ్యోతి సూచించారు. బుధవారం మండలకేంద్రంలోని 1వ అంగన్‌వాడీ కేంద్రంలో సఖి సేవలు, గృహ హింస, వరకట్న వేధింపులు, లైంగిక హింస, ఆడపిల్లల అమ్మకం, రవాణా నివారణలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మైమూదా, సరిత, మహిళలు, కిషోర బాలికలతోపాటు తదితరులుపాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ధర్నా



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

పాలకుర్తి టౌన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు దడిగ సందీప్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.2,500 కోట్ల స్కాలర్ షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. సంక్షేమ హాస్టళ్లలో కనీస వసతులు కల్పించే వరకూ ఎస్‌ఎఫ్‌ఐ ఉద్యమిస్తుందన్నారు. ఈ సందర్భంగా రాస్తారోకో చేస్తున్న విద్యార్థులతో ఎస్సై టి.శ్రీకాంత్ మాట్లాడి విరమింపజేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు విగ్నేష్, తరణ్, పవన్, పేడిక రాకేష్, రాజు, విన్ను విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వేలం

పాలకుర్తి: ఈ నెల16న బమ్మెర శివారులో నిర్వహించే ఆలేటి ఎల్లవ్వ జాతరలో కొబ్బరికాయలు, దర్శనం టికెట్లు, ప్రసాదం కౌంటర్, పార్కింగ్, దుకాణాల కోసం గురువారం బమ్మెర జీపీలో ఉదయం 10 గలకు వేలం పాటలు నిర్వహించనున్నట్లు గ్రామసర్పంచ్ జలగం నాగభూషణం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని కలిగిఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

చిల్పూరు: ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని, ఈ క్రమంలో క్రీడా పోటీలను నిర్వహించేందుకు దాతగా శ్రీపతిపల్లి సర్పంచ్ ప్రత్యూషారెడ్డి భర్త, బీఆర్‌ఎస్ నాయకుడు కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. మల్కాపూర్‌లో బుధవారం రాజన్న యువసేన ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మనోజ్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. చిల్పూరు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు, గ్రంథాలయ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీపీ సరితబాలరాజు, సర్పంచ్‌కొంగరి రవి, ఉప సర్పంచ్ వంశి, ఎంపీటీసీ సుధాకర్, రవీందర్ ఉన్నారు.

4 సార్లు గెలిచా.. మళ్లీ సిక్సర్ కొడతా..

క్రీడల నుంచే రాజకీయాల్లోకి వచ్చానని ఇప్పటి వరకు 4 రన్‌లు కొట్టానని, ఈసారి ఎదురు లేకుండా సిక్సర్ కొడతానని ఎమ్మెల్యే అన్నారు.

సంక్షిప్త సమాచారం

ముగిసిన విహార యాత్ర

జనగామ రూరల్: వడ్లకొండ గ్రీన్‌వుడ్ పాఠశాలకు చెందిన విద్యార్థుల నాలుగు రోజుల పాటు విజ్ఞాన విహార యాత్ర విజయవంతంగా ముగిసిందని పాఠశాల కరస్పాండెంట్ ఎండి సల్లావుద్దీన్ బుధవారం తెలిపారు. అరకు, విశాఖ ఎయిర్ క్రాఫ్ట్ మ్యూజియం, బొర్ర గుహలు, సముద్రతీరం, తొట్లకొండ సందర్శించడంతోపాటు ఆదివాసీల గిరిజన జీవన విధానాలు తెలుసుకున్నారని అన్నారు. ప్రిన్సిపాల్ షహనాజ్ బాను, ఉపాధ్యాయులు యాదగిరి, ప్రవీణ్, విద్యార్థులు విహార యాత్రకు వెళ్లిన వారిలో ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రఘునాథపల్లి: మండలంలోని వెల్ది మోడల్ స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో 100 సీట్ల భర్తీకి, 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ వాసం వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థులు రూ.125, ఓసీ విద్యార్థులు రూ.200తో ఆన్‌లైన్ ద్వారా ఫిబ్రవరి 15 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 16న ఏంట్రన్స్ టెస్టు నిర్వహించి, మే 15న ఫలితాలను వెల్లడిస్తామన్నారు. వివరాల కోసం 92479 92045, 81060 50845 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

బెస్ట్ అవెలబుల్ స్కీమ్‌కు..

జనగామ రూరల్: జిల్లాలోని ఎస్సీ విద్యార్థులకు ఉచిత విద్య అందించడానికి బెస్ట్ అవెలబుల్ స్కీం కింద 2023–24 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి కొర్నెలియస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు జిల్లాలోని ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం చదివేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 11 నుంచి 20 వరకు దరఖాస్తులు సమర్పించాలని, మరిన్ని వివరాలకు జిల్లా కలెక్టరేట్‌లోని ఎస్సీ సంక్షేమాధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

హామీలు విస్మరించిన పాలకులు

దేవరుప్పుల: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆదిసాయన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సీపీఐ మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు ఎల్లయ్య, సోమన్న, కిష్టయ్య, సోమనారాయణ పాల్గొన్నారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

బచ్చన్నపేట: నారాయణపురం గ్రామానికి జనగామ నుంచి హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండి. మహబూబ్ అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్‌కు వినతి పత్రాన్ని అందించారు. నాయకులు కరుణాకర్ తదితరులు ఉన్నారు.

సన్మానం

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ తహసీల్దార్‌గా పూల్‌సింగ్ చౌహాన్ బాధ్యతలు స్వీకరించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఆర్‌ఐలు, ఆఫీస్ సిబ్బంది, వీఆర్‌ఏలు ఆయనను బుధవారం సన్మానించారు. సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ దేవేందర్, ఆర్‌ఐలు రవీందర్, అర్జున్, టైపిస్టు సుష్మ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై కళాజాతా

తరిగొప్పుల: తెలంగాణ సాంస్కృతిక సారధి జనగామ జిల్లా ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని బొంతగట్టునాగారంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై కళాజాతా నిర్వహించారు. సర్పంచ్ ఇరుమల్ల బాలమణి,కళాజాత బృందం సభ్యులు బానోతు గణేష్, పిన్నింటి రత్నం, చిరంజీవి, కనకరాజు, హరిప్రసాద్, చామంతి, చంద్రశేఖర్, పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

జఫర్‌గఢ్: మండలంలోని తమ్మడపల్లి (ఐ) గ్రామానికి చెందిన రడపాక ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం ఎంపీపీ రడపాక సుదర్శన్ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి రూ. 2వేల ఆర్థికసాయం అందజేశారు.

బీఆర్‌ఎస్ నాయకుడి కుటుంబానికి..

కొడకండ్ల: నర్సింగాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు గోపాల్‌దాస్ రామచంద్రు అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం సర్పంచ్ దండంపల్లి శ్రీలత బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.2 వేలు, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఉపసర్పంచ్ శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు దేశగాని సతీష్‌గౌడ్, భానుచందర్, అంజయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

డీఏలు మంజూరు చేయాలి

పాలకుర్తి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేసి, ఉత్తర్వులు జారీ చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం అయన మండల కేంద్రంలో మాట్లాడుతూ నిత్యావసర ధరల పెంపునకు అనుగుణంగా ప్రభుత్వం ఉపాధ్యాయులకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి డీఏను ఇవ్వాలన్నారు.

విద్యుత్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి

జఫర్‌గఢ్: కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యుత్ సంస్కరణ బిల్లును ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నాయకులు సమ్మయ్య, అంజన్న, కొమురయ్య, పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘాల అభ్యంతరం అనుచితం



రఘునాథపల్లి: మాట్లాడుతున్న గోపా జిల్లా అధ్యక్షుడు మేకలపోతుల ఆంజనేయులుగౌడ్



జనగామ రూరల్: మాట్లాడుతున్న వెంకటమల్లయ్య

రఘునాథపల్లి: నీరా కేఫ్‌కు వేదామృతం పేరు పెట్టడంపై బ్రాహ్మణ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు గోపా జిల్లా అధ్యక్షుడు మేకలపోతుల ఆంజనేయులుగౌడ్ అన్నారు. మండలకేంద్రంలోని ఏఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం గోపాసభ్యులు, గౌడ సంఘం పెద్దలతో కలిసి ఆయన గోపా నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం గోపా మండల అధ్యక్షుడు రవిగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ ఔషదగుణాలు గల నీరాకు వేదామృతం పేరు పెడితే కించపరిచినట్లు ఎలా అవుతుందని ప్రశ్నించారు. సనాతన ధర్మంలో తాటిచెట్టుకు సముచిత స్థానం కల్పించారని తెలిపారు. బ్రాహ్మణ సంఘాలు తమ అభ్యంతరాలను వెనక్కి తీసుకోవాలన్నారు. గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వై కుమార్‌గౌడ్, నాయకులు లక్ష్మయ్యగౌడ్, బుచ్చయ్యగౌడ్, గైని శ్రీనివాస్‌గౌడ్, బైరగోని శ్రీనివాస్‌గౌడ్, సంజీవ్‌గౌడ్, ముప్పిడి శ్రీనివాస్‌గౌడ్, సురేందర్‌గౌడ్, శ్రీకాంత్ గౌడ్, వంగ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జనగామ రూరల్: ప్రకృతి పానియం నీరాకు వేదామృతం పేరు పెడుతే వేదాలను వక్రీకరించినట్టు ఎలా అవుతుందని కేజీకేఎస్ జిల్లా కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గోపి, ఉప్పలయ్య, రాగన్న, రమేష్, శ్రీనివాస్, భాస్కర్ పాల్గొన్నారు.

దేవరుప్పుల: నీరాకు ప్రభుత్వం వేదామృతంగా పేరు పెట్టడం సరైందని, దీనిపై బ్రాహ్మణ సంఘాలు అనుచిత వ్యవహరించడం మానుకోవాలని మండల గోపా అధ్యక్షుడు తీగల సత్యనారాయణగౌడ్ హెచ్చరించారు. మండల కేంద్రంలో గోపా సభ్యులు, గౌడ సంఘం నాయకులతో కలిసి ఆయన గోపా నూతన క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి టౌన్: తెలంగాణ ప్రభుత్వం గీత వృత్తి ద్వారా ప్రకృతి పానీయమైన కల్లుకు వేదామృతం పేరు పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్న వారిపై చట్టపరమైన చర్య తీసుకోవాలని గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యాక్షుడు మూల వెంకటేశ్వరుగౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సంఘం సమావేశంలో మాట్లాడుతూ వేదామృతం పేరు పెట్టడంపై బ్రాహ్మణ సంఘాలు అభ్యంతరం చెప్పడం సరికాదన్నారు.